నమస్తే తెలంగాణ
ఖమ్మం
5 | ఖమ్మం, మంగళవారం 8 అక్టోబర్ 2024 | KHAMMAM

# వినతుల పరిష్కారానికి ప్రాధాన్యమివ్వండి

**ప్రజావాణిలో ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**



వినతులు స్వీకరిస్తున్న ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

మామిళ్లగూడెం, అక్టోబర్ 7 : ప్రజావాణిలో బాధితుల నుంచి స్వీకరించిన దరఖాస్తులకు ప్రాధాన్యమిచ్చి త్వరితగతిన పరిష్కరించాలని ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి సందర్భంగా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్.. అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ, శిక్షణ సహాయ కలెక్టర్ మృణాల్ శ్రేష్టలతో కలిసి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా చింతకాని మండలం అనంతసాగర్‌కు చెందిన శీలం లక్ష్మి తన భర్త అనారోగ్యంతో మృతి చెందాడని, దళితబంధు యూనిట్ కింద తనకు గొర్రెలు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా.. చర్యలు తీసుకోవాలని ఎస్సీ కార్పొరేషన్ అధికారిని ఆదేశించారు. రఘునాథపాలెం మండలం వీవీపాలేనికి చెందిన కొల్లి ఉపేంద్రయ్య తనకు ఎస్సీ స్వశక్తి యూనిట్ సబ్సిడీ సాయం రాలేదని, వాటిని ఇప్పించాలని కోరుతూ చేసిన దరఖాస్తును వెంటనే పరిష్కరించాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడీని ఆదేశించారు. జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులకు ఐదు నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని, వెంటనే చెల్లించాలని కోరుతూ దరఖాస్తు చేసుకున్నారు. దీనికి స్పందించిన కలెక్టర్ వేతనాలు చెల్లింపునకు చర్యలు చేపట్టాలని డీపీవోను ఆదేశించారు. ఖమ్మం రూరల్ మండలం పెద్దతండాకు చెందిన డి.ఉపేందర్.. సాగర్ పంట కాల్వ అప్రోచ్ కెనాల్ ద్వారా రైతుల పొలాలకు నీరందించే కాల్వను ఇష్టం వచ్చినట్లు కబ్జా చేశారని, దీనిని పునరుద్ధరించి సాగు నీరు వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరగా.. వెంటనే విచారణ చేసి నివేదిక ఇవ్వాలని ఇరిగేషన్ ఈఈని ఆదేశించారు. అనంతరం జిల్లా కోశాధికారిగా పనిచేసి ఇటీవల మహబూబాబాద్ జిల్లాకు బదిలీపై వెళ్లిన సత్యనారాయణను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో దీక్షారైనా, డీఆర్‌డీవో సన్యాసయ్య, కలెక్టరేట్ ఏవో అరుణ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఏఎంసీలో ఆర్డీ దందా!

• ఖరీదుదారుల మాయాజాలం • ఉత్తుత్తి దడవాయిలదే ప్రధాన భూమిక • ప్రభుత్వ ఖజానాకు గండి


ఖమ్మం మార్కెట్ ముఖద్వారం


ఖమ్మం ఏఎంసీ మిర్చి యార్డుకు రైతులు తీసుకొచ్చిన బస్తాలు (ఫైల్)

ఖమ్మం వ్యవసాయం, అక్టోబర్ 7 : ఖమ్మం నగర వ్యవసాయ మార్కెట్‌లో ఖరీదుదారులు ఆర్డీ(రేట్ డిఫరెన్స్) దందాకు తెరలేపినట్లు ప్రచారం జోరుగా జరుగుతున్నది. అసలే అన్‌సీజన్ కావడంతో నీకింత... నాకింత అన్నట్లుగా వ్యవహారం సాగుతోంది. ఖరీదుదారుల సిండికేట్ దందానా.. మరేమిటో తెలియదు కానీ రెండు నెలలుగా జెండాపాటలో మార్పులేదు. ప్రస్తుతం రైతులు వానకాలం పంటలను అమ్మునేందుకు సిద్ధం కాగా.. ఖరీదుదారులు మరో దందాకు తెరలేపారు. కొందరు దడవాయిలను మచ్చిక చేసుకొని మార్కెట్ అధికారులకు తెలియకుండా ఆర్డీ దందాకు పాల్పడుతున్నారు. ఎండు మిర్చి పంటను కొనుగోలు చేసి దడవాయిల రికార్డుల్లో మాత్రం తక్కువ ధరకు పంటను కొనుగోలు చేసినట్లు చూపుతున్నారు. విదేశాలకు ఆశించిన మేర ఎగుమతులు లేకపోవడంతో అసలైన ఖరీదుదారులు కొనుగోళ్లకు దూరంగా ఉన్నారు. దేశీయ వాడకం నిమిత్తం కొనుగోలు చేసి, ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసే కొందరు వ్యాపారులు ఈ దందాకు శ్రీకారం చుట్టినట్లు తెలుస్తున్నది. ఈ తతంగం కేవలం దడవాయిలు, వ్యాపారులకు మధ్య అవగాహనతోనే కొనసాగుతుండడం విశేషం. దీనికితోడు ఒక్కరిద్దరు పత్తి, మిర్చి ఖరీదుదారులు ఏకంగా జీరో దందాకు తెగబడుతున్నట్లు కూడా ఆరోపణలు వినిపిస్తున్నాయి. వ్యాపారులు, ఖరీదుదారులు, దడవాయిల మధ్య పొరపొచ్చాలు రావడంతో మార్కెట్‌లో బహిరంగంగానే ఆరోపణలు చేసుకుంటున్నారు. మార్కెట్లో అక్రమ వ్యాపారాలు, ఎలాంటి ఆధారాలు లేని వ్యక్తుల చేతుల్లోకి కాంటాలు వెళ్లడంతోనే సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని కొందరు వ్యాపారులు వాపోతున్నారు.

**ఉత్తుత్తి దడవాయిలతోనే చిక్కులు..**

నగర వ్యవసాయ మార్కెట్ ఏర్పడి దాదాపు 90 సంవత్సరాలు కావస్తున్నది. ఈ కాలంలో అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. పదుల సంఖ్యలో ఉన్న కమీషన్ వ్యాపారులు వందల సంఖ్యలోకి వచ్చారు. ఖరీదుదారులు 20-30 నుంచి 350 మందికి పైగానే అయ్యారు. వీరితోపాటు ట్రాలీ అసోసియేషన్, హమాలీలు, చివరకు ఉద్యోగుల సంఖ్య సైతం రెండు మూడు రెట్లు పెరిగింది. కానీ.. దడవాయిలు గతంలో 86 మంది ఉండగా.. అదే సంఖ్య నేటికీ కనపడుతున్నది. మార్కెట్ ఏర్పడిన తొలినాళ్లలో దడవాయి పని చేయలేని వారు తన వారసుడు లేదా ఇతర వ్యక్తులకు పనిని అమ్ముకునే వారు. రానురాను దాని విలువ భారీగా పెరిగిపోయింది. ఒక్కో దడవాయి పని ఇతర వ్యక్తి కొనుగోలు చేస్తే ఆందుకు ప్రతిఫలంగా రూ.15 లక్షల నుంచి రూ.18 లక్షల వరకు ముట్టజెప్పడం విశేషం. గత కొద్దినెలల్లోనే 86 మందిలో 20 మంది వరకు పని అమ్ముకున్నట్లు సమాచారం. అయితే ఇంత పెద్ద మొత్తంలో పని కొన్న కొత్త వ్యక్తులే అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఖరీదుదారులకు సహకరిస్తూ తక్కువ ధరను వేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. కాంటాల ప్రక్రియలో సైతం అనేక అవకతవకలకు పాల్పడుతున్నట్లు ప్రచారం జరుగుతున్నది. కేవలం నల్ల రంగు అంగీ తప్ప వారికి లైసెన్స్ లేకపోవడంతోనే ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారని మార్కెట్ వర్గాల్లో విస్తృత ప్రచారం జరుగుతున్నది.

**జీరో, ఆర్డీ దందాకు అవకాశం లేదు..**



వ్యవసాయ మార్కెట్‌లో జీరో, ఆర్డీ దందాకు ఏమాత్రం తావులేదు. ఖరీదుదారులు జీరో దందాకు పాల్పడే అవకాశం లేకుండా నూతన సాంకేతిక పరిజ్ఞానం వాడుతున్నాం. గేట్ ఎంట్రీలు, అవుట్‌పుట్‌లను నిరంతరం పరిశీలిస్తున్నాం. వేమెన్ ఇంటిగ్రేషన్ విధానం కొనసాగుతున్నది. దడవాయిలు కొందరు పని అమ్ముకున్నారని తెలిసింది.. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటాం.

– ప్రవీణ్‌కుమార్, ఖమ్మం ఏఎంసీ సెక్రటరీ

# అంతర పంటల సాగుతో ఆదాయం

**భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్**


గిరిజన రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

దుమ్ముగూడెం, అక్టోబర్ 7 : ఏజెన్సీ గ్రామాల రైతులు అంతర పంటలు సాగు చేసి అధిక ఆదాయం పొందవచ్చని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అన్నారు. బొజ్జిగుప్ప, రామచంద్రునిపేట గ్రామాలను సోమవారం సందర్శించిన కలెక్టర్ ఆయా గ్రామాల్లో గిరిజన రైతులతో ముఖాముఖి నిర్వహించారు. పాత తరం వ్యవసాయ పద్ధతులపై ఆరా తీశారు. సాగులో సరికొత్త విధానాలు పాటించాలని సూచించారు. పొలం గట్ల వెంట, ఇంటి వెనుక పెరట్లో మునగ, జామ మొక్కలతో పాటు ఫలాలు అందించే మొక్కలను నాటి ఫలసాయం పొందాలన్నారు. ఆయా గిరిజన గ్రామాలు, గూడేల్లో గిరిజన సంస్కృతీ సంప్రదాయాలు ప్రస్తుత తరానికి అర్థమయ్యేలా ట్రైబల్ మ్యూజియాన్ని అభివృద్ధి చేస్తామని, గిరిజన వ్యవహారాలకు సంబంధించి గ్రామాల్లో వాటి గుర్తులను పదిలం చేసుకుని పర్యాటకులకు వివరించాలన్నారు. పాత కాలపు గృహాలు, మట్టితో కట్టిన ఇళ్లు పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తాయని, వాటిని పదిలంగా ఉంచాలని గిరిజనులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అశోక్‌కుమార్, ఎంపీడీవో యాదయ్య, ఎంపీవో రామకృష్ణ, ఆర్‌ఐ వెంకటేశ్వర్లు, ఆయా పంచాయతీల కార్యదర్శులు, ఐటీడీఏ అధికారులు పాల్గొన్నారు.

# అర్జీలను త్వరగా పరిష్కరించండి

**భద్రాద్రి అదనపు కలెక్టర్ వేణుగోపాల్**


విజ్ఞప్తులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ వేణుగోపాల్

భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ) : వివిధ సమస్యలపై బాధితులు ఇచ్చే ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని భద్రాద్రి అదనపు కలెక్టర్ వేణుగోపాల్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీవోసీ కార్యాలయ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులను ఆయా శాఖల అధికారులకు ఎండార్స్ చేశారు. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో నడిచే మూకమామిడి పామాయిల్ సీడ్ ప్రొడ్యూసర్ కంపెనీ వారు తమ సంస్థలో 612 మంది రైతులు సభ్యులుగా ఉన్నారని, మూడేళ్లుగా వారికి కావాల్సిన ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు తక్కువ ధరకు విక్రయిస్తూ సేవలు అందిస్తున్నామని, తమ సంస్థకు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంజూరు చేయాలని దరఖాస్తు చేసుకోగా.. దానిని పరిశీలించి పౌరసరఫరాల శాఖకు ఎండార్స్ చేశారు. అశ్వాపురం మండలం రామవరం గ్రామానికి చెందిన గొగ్గల భద్రమ్మ తన భర్త గాదెయ్య 2021లో మరణించాడని, అనేకసార్లు వితంతు పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్నా మంజూరు కాలేదని, తనకు పెన్షన్ మంజూరు చేయాలని అర్జీ సమర్పించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు

**మందులు, సిబ్బంది కొరత లేకుండా చూసుకోవాలి**

**భద్రాచలంలో మినీ టీహబ్ ఏర్పాటుకు ప్రతిపాదనలు రూపొందించండి**

**ఐటీడీఏ పీవో రాహుల్**


సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో రాహుల్

భద్రాచలం, అక్టోబర్ 7 : ఏజెన్సీలోని ఆదివాసీ గ్రామాలు, గూడేల్లో గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి ప్రభుత్వం దృఢ సంకల్పంతో ఉన్నదని భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ అన్నారు. భద్రాచలంలోని తన చాంబర్‌లో ఐటీడీఏ పరిధిలోని ఖమ్మం, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల మెడికల్ ఆఫీసర్లతో సోమవారం సాయంత్రం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటీడీఏ పరిధిలోని గిరిజనులు తమ నివాస ప్రాంతాల నుంచి అరగంటలోనే ఆసుపత్రికి చేరుకోవడానికి పీహెచ్‌సీలు, సబ్‌సెంటర్లలో వైద్యులు, సిబ్బంది నియామకం, అవసరమైన చోట బైక్ అంబులెన్స్‌ల ద్వారా మారుమూల ప్రాంతాల్లో వైద్య సేవలు అందించడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. పీవీటీజీ గిరిజనులకు ప్రత్యేక వార్డు ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. గోదావరి వరద ముంపునకు గురయ్యే గిరిజన గ్రామాలు, రోడ్డు సౌకర్యం లేని గూడేల్లోని గర్భిణులను ప్రసవ వేదనకు ముందే పీహెచ్‌సీలకు తరలించడానికి 108 వెళ్లలేని ప్రాంతాలకు బైక్ అంబులెన్స్ ద్వారా తరలించేలా చూడాలని, అందుకు సంబంధించి కూడా ప్రతిపాదనల్లో పొందుపర్చాలన్నారు. ప్రస్తుతానికి టీహబ్ భద్రాద్రి జిల్లా కేంద్రంలో ఉందని, భద్రాచలంలో మినీ టీహబ్ ఏర్పాటుకు ప్రభుత్వం సంకల్పించినందున అందుకు సంబంధించి ప్రతిపాదనలు తయారు చేయాలని ఆదేశించారు. పీహెచ్‌సీకి దూరంగా సీఎస్‌సీ ఉండాలని, హెల్త్ హ్యాబిటేషన్ల వారీగా అరగంటలో చేరుకునే విధంగా రహదారి సౌకర్యం ఉండేలా చూడాలన్నారు. ఆర్‌అండ్‌బీ, పోలీసు శాఖ సహకారంతో నేషనల్ హైవేల్లో కానీ, మండలాల్లో కానీ, గ్రామాల్లో కానీ ప్రమాదాలు జరిగిన చోట అంబులెన్స్ సౌకర్యం ఉండేలా చూడాలన్నారు. మెడికల్ ఆఫీసర్లు, సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలని, మందుల కొరత అనేది లేకుండా చూసుకోవాలని, సిబ్బంది, ఏఎన్‌ఎం, ఆశా వర్కర్లపై మెడికల్ ఆఫీసర్ పర్యవేక్షణ ఉండాలన్నారు. త్వరలోనే ఐటీడీఏ పరిధిలోని గిరిజన గ్రామాల్లో అన్ని రకాల స్పెషలిస్టు వైద్యులతో వైద్య శిబిరాల నిర్వహణకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో డీఎంహెచ్‌వో భాస్కర్‌నాయక్, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ రామకృష్ణ, వైద్యులు చైతన్య, వివిధ సబ్‌సెంటర్లు, పీహెచ్‌సీల వైద్యులు పాల్గొన్నారు.

# ధనలక్ష్మిగా లక్ష్మీతాయారు అమ్మవారు

**భద్రాద్రిలో వైభవంగా కొనసాగుతున్న దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు**


ధనలక్ష్మి అవతారంలో దర్శనమిస్తున్న లక్ష్మీతాయారు అమ్మవారు

భద్రాచలం, అక్టోబర్ 7 : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయంలో సోమవారం లక్ష్మీతాయారు అమ్మవారు ధనలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. నాలుగు రోజులుగా వైభవోపేతంగా కొనసాగుతున్న ఉత్సవాల్లో భాగంగా అర్చకులు అమ్మవారికి స్నపన తిరుమంజనం నిర్వహించడంతోపాటు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం నిర్వహించిన సామూహిక కుంకుమార్చనకు మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అలాగే చిత్రకూట మండపంలో శ్రీరామాయణ పారాయణోత్సవాల్లో భాగంగా వేదపండితులు, అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**ధనలక్ష్మి అమ్మవారి విశిష్టత**

'హిరణ్యవర్ణాం హరిణీం సువర్ణ రజతస్రజాం.. అంటూ శ్రీసూక్తం అమ్మవారిని ధనలక్ష్మిగా కీర్తిస్తుంది. ధనం అంటే.. కేవలం డబ్బు మాత్రమే కాదు.. విద్య, బలం, కీర్తి తదితరాలన్నీ ధనమే. విద్య, హిరణ్య, శక్తి, ధనాలను ప్రసాదిస్తుంది, అందుకే ఈ రూపంలో ఉన్న ధనలక్ష్మి అమ్మవారిని దర్శించుకోవడం పూర్వజన్మ సుకృతం' అంటూ పురాణాలు చెబుతున్నాయి. ఈ సందర్భంగా కిష్కింధకాండ పారాయణం చేశారు.

**నేడు ధాన్యలక్ష్మి అవతారం**

భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయంలోని ఉప ఆలయంలో లక్ష్మీతాయారు అమ్మవారు మంగళవారం ధాన్యలక్ష్మిగా భక్తులకు దర్శనమిస్తారు.

# 'అర్బన్' తహసీల్దార్‌పై కలెక్టర్ సీరియస్

**సర్టిఫికెట్ల జారీలో జాప్యంపై ఆగ్రహం**


ఖమ్మం అర్బన్ తహసీల్దార్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కలెక్టర్

మామిళ్లగూడెం, అక్టోబర్ 7: ఖమ్మం అర్బన్ తహసీల్దార్ స్వామిపై కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు పలు సర్టిఫికెట్ల జారీలో ఖమ్మం అర్బన్ తహసీల్దార్ నిర్లక్ష్యంగా వ్యవహరించారని, దీని వల్ల తాము ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని కోల్పోయామని, వచ్చిన ఉద్యోగాలు పొందేందుకూ అర్హత కోల్పోయామని సోమవారం నాటి గ్రీవెన్స్ వద్ద పలువురు ఉద్యోగార్థులు కలెక్టర్‌కు విన్నవించారు. దీంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన కలెక్టర్.. సదరు తహసీల్దార్‌ను ఐడీవోసీలోని గ్రీవెన్స్ వద్దకు పిలిపించారు. కొద్దిసేపటికి సదరు తహసీల్దార్ అక్కడికి రాగానే.. జిల్లా అధికారుల ముందే అతడికి చీవాట్లు పెట్టారు. కొందరు ఉద్యోగార్థులు ఎన్నో ఏళ్లుగా పట్టుదలతో చదివి ఉద్యోగాలు సాధిస్తే.. వారికి సకాలంలో సర్టిఫికెట్లు జారీ చేయకపోవడం వల్ల వారు ఆయా ఉద్యోగాలు కోల్పోవాల్సి వచ్చిందని మందలించారు. ఇలాంటి నిర్లక్ష్యపు పనితీరు ప్రదర్శిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అయితే ఇటీవలి వరదల్లో ధ్రువపత్రాలు కొట్టుకుపోయిన వారికి, డీఎస్సీ అభ్యర్థులకు, ఆరోగ్య శాఖ అభ్యర్థులకు సర్టిఫికెట్లు జారీ చేసే విషయంలో కూడా సదరు తహసీల్దార్ నిర్లక్ష్యంగా వ్యహరిస్తున్నారంటూ పలువురు అభ్యర్థులు స్వయంగా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

# బతుకమ్మ ఆడుతూ.. సందేశమిస్తూ..

**'సే.. నో డ్రగ్స్' ప్లకార్డులతో 'అబ్కారీ' బతుకమ్మ**


ఖమ్మం జిల్లా ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో బతుకమ్మ ఆడుతున్న మహిళా అధికారులు, ఉద్యోగులు

మామిళ్లగూడెం, అక్టోబర్ 7 : బతుకమ్మ అంటే.. మహిళలు, యువతులు సేకరించిన తీరొక్క రంగు పూలతో బతుకమ్మలను పేర్చి ఆడిపాడుతారు. సందడి చేస్తారు. కానీ.. ఖమ్మం జిల్లా ఎక్సైజ్ పోలీసులు ఆ శాఖ కార్యాలయ ప్రాంగణంలో వారి కుటుంబ సభ్యులతో కలిసి సే.. నో డ్రగ్స్ అంటూ ప్లకార్డులు చేబూని వినూత్న రీతిలో బతుకమ్మలు పేర్చారు. సమాజానికి మంచి సందేశం ఇవ్వాలనే సంకల్పంతో సే.. నో డ్రగ్స్ అంటూ పూలతో తయారు చేసిన బతుకమ్మలను తయారు చేసి ఆడిపాడారు. డయల్-1098ను పూలతో తీర్చిదిద్ది మంచి సందేశాన్ని అందించారు. బతుకమ్మల రూపంలో మంచి సందేశాన్ని అందించిన సిబ్బందిని ఖమ్మం ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో మహిళా అధికారులతోపాటు సహాయ కమిషనర్ గణేశ్, వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆదివాసీ గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి


• పల్లెల్లోకి వచ్చే మావోయిస్టులను నిలదీయండి: ఎస్పీ


పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు

చర్ల, అక్టోబర్ 7: అత్యంత వెనుకబడిన ఆదివాసీ గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాల కృషి చేస్తున్నదని, ప్రభుత్వ పథకాలను ఆదివాసీలు సద్వినియోగం చేసుకుని అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజు అన్నారు. సోమవారం బూరుగుపాడు గ్రామంలో చర్ల పోలీసుల సహకారంతో నిర్మించిన ప్రాథమిక పాఠశాలను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ చదువుతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని, గ్రామంలోని ప్రతి ఒక్కరూ తమ పిల్లలను పాఠశాలలకు పంపించాలన్నారు. ప్రధానంగా విద్య, వైద్యం, రహదారుల సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందన్నారు. ఆదివాసీ గ్రామాలు, గూడేలకు వచ్చే మావోయిస్టుల మాటలు నమ్మొద్దని, తమ గ్రామాలకు వారేం చేశారో చెప్పాలని అక్కడే నిలదీయాలన్నారు. బూరుగుపాడు గ్రామం ఇతర ఆదివాసీ గ్రామాలకు ఆదర్శంగా ఉండాలని, మూఢ నమ్మకాలు, దేవర్లు, ఆకుపసర్ల వంటి వాటిని నమ్మొద్దని, వైద్యం కోసం పోలీసుల సహాయం తీసుకోవాలని సూచించారు. అటవీ శాఖ నుంచి క్లియరెన్స్ రాగానే మీ గ్రామానికి రోడ్డు నిర్మాణం చేపడతామని, అందుకు అవసరమైన చర్యలు ఇప్పటికే చేపట్టామని ఎస్పీ తెలిపారు. చిన్న పాకలో చదువుకునేందుకు ఇబ్బందిపడుతున్న చిన్నారుల దయనీయ స్థితిని చూసి స్పందించి పాఠశాల భవన నిర్మాణానికి ముందుకొచ్చిన చర్ల సీఐ రాజువర్మను ఎస్పీ ఈ సందర్భంగా అభినందించారు. సమావేశంలో ఓఎస్డీ సాయిమనోహర్, సీఐ, అధికారులు పాల్గొన్నారు.

# ఫొటోగ్రఫీ, షార్ట్‌ఫిల్మ్ పోటీలకు ఆహ్వానం

**ఫ్లాగ్ డే కోసం 20లోపు ఎంట్రీలు పంపాలి: సీపీ సునీల్‌దత్**



మామిళ్లగూడెం, అక్టోబర్ 7: పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం (ఫ్లాగ్ డే) సందర్భంగా ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఔత్సాహిక ఫొటోగ్రాఫర్లకు ఫొటోగ్రఫీ, షార్ట్ ఫిల్మ్‌ల విభాగాల్లో తెలంగాణ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో పోటీలను నిర్వహించనున్నట్లు సీపీ సునీల్‌దత్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ ఈ నెల 21న వారోత్సవాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. దీనిలో భాగంగా పోలీసుల త్యాగాలను, విధుల్లో వారి ప్రతిభను తెలిపే విధంగా ఉన్న ఇటీవల తీసిన మూడు ఫొటోలను, మూడు నిమిషాల నిడివి ఉన్న షార్ట్‌ఫిల్మ్‌లను రాష్ట్రస్థాయి పోటీల కోసం ఈ నెల 20లోపు ఖమ్మం పోలీస్ కమిషనరేట్‌లో అందించాలని సూచించారు. పూర్తి వివరాలకు 8712659256కు సంప్రదించాలని కోరారు.